# లాకీ

మహా నాయకుడు, గొప్ప వ్యక్తి. విశిష్ట మేధావి. దేశం గర్వించదగ్గ సంపాదకుడు. ఉద్యమ నిర్మాత. పోరాటాలలో ఆరితేరిన సమర్థుడు రావు మాసిన బట్టలతో హోటల్ ముందు కనిపించాడు.

'తమ్ముడూ!' అని పిలిస్తే వెనక్కు తిరిగి చూసి, 'అన్నా!' అని దగ్గరకు వస్తుంటే ఎదురేగి కావిలించుకొన్నాడు రాం.

'ఏమిటిలా?' అన్నాడు ఎగాదిగా చూస్తూ. మాసిన బట్టలేమిటి అనీ కావచ్చు. ఉదయం హోటల్‌కి ఉన్న ఊళ్ళో రావటం ఏమిటనీ కావచ్చు.

'పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ తీసుకుపోదామని వచ్చాను. మీ మరదలు వంట్లో బాగాలేదు. ఏం జబ్బో తెలియదు. మరేదో కావచ్చు. పిచ్చిగా మాట్లాడుతుంది. ప్రవర్తిస్తుంది.' మాసిన బట్టలకు కారణం తాను చెప్పకపోయినా రాం అర్థం చేసుకున్నాడు. భార్యకు సేవ చేస్తూ నిద్రాహారాలు మానాడని.

'నువ్వు రాకపోతే ఏం? కార్యకర్తల్లో ఎవరినో పంపకూడదా?'

'వాళ్లు తిని తీరుబడిగా వస్తారు. వెంట ఉంటే తిండి పెట్టాలి. రాత్రి పంపేశాను'.

'పనిమనిషి – వంటామె?'

'మానేసింది!' ఇద్దరూ లోపలికి పోయారు. శుభ్రంగా ఉన్న టేబిల్ చేసి కూర్చుని కావలసినవి ఆర్డరు చేశారు.

'అన్నా ఊరి నుంచి ఎప్పుడు వచ్చావు?'

'ఇప్పుడే! నిన్ను చూద్దామనే! నువ్వే కనిపించావు!'

పార్శిల్ పాకెట్లు తీసుకొని బిల్లు తీసుకొని పైకి లేస్తున్నప్పుడు 'మాట వరసకు కూడా బిల్లు నేనిస్తాననను' రాం నవ్వాడు. బిల్లు చెల్లించాడు. బయటకి వచ్చారు. అటూ ఇటూ చూస్తూ 'కారు?' అన్నాడు రాం. 'అమ్మేశాను' చెప్పాడు రావు. ఆటో ఎక్కారు.

రాం సెక్రటేరియేట్‌లో సెక్షన్ ఆఫీసరు. ఆర్డీవోగా అనంతపురం బదిలీ అయ్యాడు. రావు 'ప్రభుత్వ ప్రతిష్ట' పత్రికా సంపాదకుడు. ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

ఇంట్లో రావు భార్య నిస్తేజంగా మంచం మీద పడుకొని ఉంది. నిద్రపోవటం లేదు. కళ్ళు తెరిచి చూస్తూఉంది. కదలటం లేదు. 'బావగారూ!' అంటూ లేవలేదు. అసలు పలకరించలేదు.

పిల్లలిద్దరూ ఆడుకొంటున్నారు. మంచం మీదే ఉన్నారు. దిగలేదు. కాలకృత్యాలు తీర్చినట్లు లేవు. నమ్మకంగా స్నానం చేయలేదు వాళ్ళు. స్కూలుకు పోయే ప్రయత్నంలో లేరు.

'వీళ్ల స్కూలు టైం అయినట్లుంది!'

'వాళ్ళు స్కూలుకు పోయే పని లేదు. మానిపించాను'.

'ఏం? ఎందుకు మానిపించటం!'

'నేను తెలుగు పత్రిక సంపాదకుణ్ణి కదా. కొడుకుల్ని కనీసం తెలుగు మీడియంలో చదివంచవద్దా? బస్తీ బడిలో చేర్పించాలి'

ఇంగ్లీష మీడియం మాన్పించటం తెలుగు మీడియం మీద ప్రేమకంటే ఏదో సమస్య కారణం అయి ఉండాలి. తల్లిని చూసుకోవాలా? ఇంట్లో పనులు చేసుకోవాలా? నెలకు ఇద్దరికీ నాలుగువేలు స్కూలు ఫీజులు కట్టలేకా? రాం ఆందోళనగా ఉన్నాడు.

పిల్లలిద్దరినీ పిలిచాడు. టేబిల్ మీద టిఫిన్ పొట్లాలు ప్లేటుల్లో పెట్టాడు రావు. వాళ్ళు ఆవురావురుమంటూ తింటున్నారు. భార్య ముఖం కడిగి, కూర్చోబెట్టి ఇడ్లీ తినిపించాడు. తనే కాఫీ పెట్టి, తెచ్చి భార్యకిచ్చాడు. ఆమె తాగుతున్నప్పుడు ఇల్లు ఊడ్చి వచ్చి ఎదురుగా కూర్చున్నాడు.

'అన్నా! విశేషాలు ఏమిటి?'

'ఏమున్నాయి? మామూలే! సోఫా సెట్ ఏది?'

'రిపేరుకిచ్చాను' రాం నమ్మలేదు.

'టివీ? అదీ రిపేరేనా?'

'ఆఁ!' అన్న నమ్మటం లేదని రావుకు అర్థమయిపోయింది.

పిల్లలు చేతులు కడుక్కొని మూతులు తుడుచుకొని, బొమ్మల పుస్తకాలు చూస్తూ కూర్చున్నారు.

మహానాడు ఉద్యమం ఖర్చులకు రెండువేలు ఇద్దామని వచ్చాడు రాం. అయిదువేలు ఇచ్చాడు. మునుపు ఇస్తే వద్దనేవాడు. ఇప్పుడు వద్దనలేదు. తీసుకొని జేబులో పెట్టుకున్నాడు.

'ఉద్యమం ప్రోత్సాహానికి నిధులు రావటం లేదా?'

'రావటం లేదు. వెంటనే చేపట్టవలసిన కార్యక్రమాలు ఏమీలేవు కదా! అంతేకాదు. ఉద్యమం చీలిపోయింది. మరో మూడు చీలకలున్నాయి కదా! కొత్తొక వింత. వింతకు నిధులు సమకూరటం సహజమే. కార్యకర్తలు కూడా తగ్గారు.'

'నేను దూరంగా ఉన్నాను కదా. న్యూసే కాని వాస్తవాలూ తెలియడం లేదు.'

ఇంతలో బిలబిలమంటూ పదిమంది కార్యకర్తలు వచ్చారు. ఆందోళనగా వున్నారు. ఏమయినా చేయాలన్నారు. కనీసం స్టేటుమెంటయినా ఇయ్యాలన్నారు.

రావు దీర్ఘంగా ఆలోచనలో పడ్డాడు. వాళ్ళూ తమ్ముళ్ళే. వాళ్లు చేస్తున్నదీ ఇదే ఉద్యమం. అందరూ కలిసి ఉద్యమాలు చేసి సాధించే ఫలితం ఒక్కటే. వాళ్ళకు వ్యతిరేకంగా ఉద్యమం అక్కరలేదు. స్టేటుమెంటూ అక్కరలేదు.

కార్యకర్తలకు చేతికో, నోటికో పని ఉండాలి. వద్దంటే నీరసించిపోతారు. దూరమవుతారు. ఉద్యమం నీరుగారిపోతుంది. వాళ్ళను దూరం చేసుకోరాదు. అలా అని ఏ చేతా, మాటా అవసరం కావు. 'ఆలోచిద్దాం' అన్నాడు రావు. నాయకుడు ఆలోచిస్తున్నాడని వాళ్లు మౌనంగా ఉన్నారు.

'టీ తాపించవా?' అన్నాడో కార్యకర్త.

రావు జేబులోంచి రాం ఇచ్చిన డబ్బు బయటకి తీసి, 'టీలు పది' అని పెద్ద పిల్లవాడికి ఇచ్చాడు. పిల్లవాడు వెళుతుంటే 'నేను వెళతానని ఏ కార్యకర్తా ముందుకు రాలేదు. వాళ్లంతా కలిసి అన్న చెబితే, ఏం చెబితే, అది చేస్తారు. వాళ్ళంతటవాళ్ళేం చేయరు. పైగా వాళ్ళిప్పుడు అతిథులు.

పిల్లవాడు టీలు తెచ్చి కార్యకర్తలకిస్తుంటే రాంగుండె గుబగుబలాడింది. పిల్లలు చదువు మాని పనిపిల్లలయ్యారు. వాడికి షర్టులేదు. నిక్కరు జారిపోతూ ఉంది.

దళితులు చీలిపోవటం ఇష్టం లేదు రావుకు. వీళ్ళు సమైక్యంగా ఉండాలి. అందుకు పోరాడాలి. అది అతడిఆలోచన. ఉద్యమం, కార్యరంగం, ప్రజాస్వామ్యంలో పోరాటం అనివార్యం అవసరం.

దళితులు చీలిపోవటం అవసరమని మాదిగలు దండోరా వేస్తున్నారు. అన్నదమ్ములు ఆస్తులు పంచుకొన్నట్లు ప్రభుత్వం ఇచ్చే రిజర్వేషన్లు, రాయితీలు జనాభా దామాషా ప్రకారం పంచుకోవాలని, పంచుకోకపోతే తాము అభివృద్ధి సాధించలేమని మాదిగల ఉద్యమం.

దీనివల్ల దళితుల సమైక్యత దెబ్బ తింటుంది. కలిసి ఉంటే పోరాడి సాధించుకోవచ్చు. విడిపోతే బలహీనులమై చెడిపోతామని రావు పోరాటం.

విడిపోయి, సమానతను సాధిస్తే, సమైక్యత సాధ్యమని మాదిగలు, సమైక్యంగా ఉండి, ప్రభుత్వం ఇచ్చే రాయితీలు అధికంగా పొందాలని మాలలు కోరుతున్నారు. వీళ్ళకు రావు నాయకుడు.

ప్రభుత్వం వర్గీకరణ చేసి మాదిగలకు మేలు చేసిందని ఒకరు భావిస్తుంటే, విడదీసి వీళ్ళను శత్రువులను చేసిందని, ఓటు రాజకీయం చేసిందని మరొకరు తలిచారు.

పోరాటం చేసి, ప్రయోజనం చేకూరిందని మాదిగలు సంతోషంగా ఉన్నారు.

వర్గీకరణం పేరిట మాలలను వేరుచేసి కీడు చేశారని మాలలు దుఃఖంతో ఉన్నారు. వీళ్ళ నాయకుడు రావు.

తన నాయకత్వం, ఉద్యమం, లక్ష్యం, మాటలు, చేతలు ప్రభుత్వానికి వ్యతిరేకం కాబట్టి, ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి ఉద్యమం కొనసాగించటం కష్టంగా ఉంది.

ఇప్పటికే ప్రభుత్వ వ్యతిరేక రాతలు 'ప్రభుత్వ ప్రతిష్ట'లో సంపాదకుడు రాస్తున్నాడని రావు మీద ఆరోపణలున్నాయి. ప్రభుత్వం సంజాయిషీ అడుగుతూ వుంది. జవాబు వ్రాస్తే, ఆరోపణ నిరూపణ అయిందని డిస్మిస్ చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రావు గుర్తించాడు.

తను స్వేచ్ఛగా ఉద్యమం నడపటానికి తన పదవికి రాజీనామా చేయాలని రావు తీవ్రంగా ఆలోచిస్తూ ఉన్నాడు.

కానీ తనకు ఆస్తిపాస్తులు లేవు. నెలజీతం ముప్పై వేలు వదులుకొంటే సంసారం సాగటం కష్టం. అందుకోసం గుంజాటనలో పడ్డాడు రావు. ఉద్యోగం వదులుకోలేక ఉద్యమం వదులుకోలేక గొట్టుమిట్టాడుతున్నప్పుడు, జనరల్ ఎలక్షన్లు ప్రకటన వెలువడింది.

ప్రతిపక్షంలో ఉన్న పార్టీ నుంచి యం.యల్.ఏ.గా పోటీ చేయటానికి రావు ఆలోచిస్తున్నప్పుడు పార్టీ టిక్కెట్లు ఇస్తున్నట్లు తనకు ఇష్టమైన నియోజకవర్గం నుంచి నిలబడమని నిర్ణయించింది. నియోజకవర్గం చెప్పాడు. బి.ఫారం ఇచ్చారు.

ఎన్నికలలో నిలబడే అభ్యర్థి ఆదాయం వచ్చే ఏ ఉద్యోగంలో ఉండకూడదు కాబట్టి. రావు తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది, చేశాడు.

రాజీనామా అంగీకరించినట్లు లేఖ చేత ఉంటేనే నామినేషన్ అంగీకరింపబడుతుంది. దాన్ని ఇంకా అంగీకరించలేదు.

ఇంకా ఎందుకు రాజీనామా గ్రహించి పదవీ బాధ్యతల నుంచి రావును తొలగించలేదని ఎవరెవరినో ప్రశ్నిస్తే, ఆర్థిక అడ్వాన్సులు రావు తీసుకొన్నాడా లేదాః,

తీసుకుంటే ఖర్చుకు బిల్లులు పెట్టాడా లేదా? రాజీనామా అంగీకరించి అతన్ని పదవీ విధుల నుంచి తప్పించటానికి అభ్యంతరాలు ఏమయినా ఉన్నాయా లేదా అని అధికారిని అడిగినట్లు సమాధానం చెబుతూ వచ్చారు.

సమాచారశాఖ కమీషనరు రావు రాజీనామా అంగీకరింపవలసి వుండగా, ప్రభుత్వం ఆ రాజీనామా లేఖను ఎందుకు పరిశీలింపవలసి వచ్చిందని అడిగితే, అతడిమీద చాలా చార్జీలున్నాయి కాబట్టి, ఆ దృష్టితో దీన్ని పరిశీలింపవలసి ఉంటుందని అధికారులు చెబుతున్నారు కాని నిజమేమీ కాదని రాంకు తెలుసు.

సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసరుగా ఉన్న రాందగ్గర ఆ రాజీనామా లేఖ ఉంది.

ఎన్నికలు అయిపోయిందాకా ఆ రాజీనామా లేఖ పరిశీలించే అవసరం లేదని పై అధికారి చెప్పాడు.

దాంతో ఆ ఫైలు తన టేబిల్ మీదే ప్రతిక్షణం కనిపిస్తూ, ఏడిపిస్తూ ఉంది రాంని.

నామినేషన్ వేసే చివరితేదీ అయిపోతూ ఉన్నప్పుడు పార్టీ మరో అభ్యర్థికి బి.ఫారం ఇచ్చింది.

రావుకి ఉద్యోగం పోయింది. ఎవరో ఎం.ఎల్.ఏ.గా గెలిచారు.

ఇంకా రాజీనామా లేఖ అంగీకరింపబడలేదు. తిరస్కరించినట్లూ చెప్పలేదు.

ఈ పరిస్థితి రాం కల్పించాడు. రావు మళ్ళీ ఉద్యోగంలో చేరదలిస్తే, ఈ రాజీనామా ఉపసంహరించుకోవచ్చు. అందుకే ఆ ఫైలు అలాగే ఉంచాడు.

ఎన్నిక అయిపోయినా, తమ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా, తాను ఉద్యోగంలో చేరే అవకాశం ఉన్నా చేరలేదు. దాని మీద ఏ చర్యాలేదు కాబట్టి, రావలసిన సొమ్ము రాలేదు. జీతం లేదు.

సంవత్సరం గడిచిపోయింది. ఉద్యమం చీలిపోయింది. ఉత్సాహం తగ్గిపోయింది.

వచ్చి, ఏమేమో చెప్పి, ఏదేదో చేయమని కోరి, టీలు తాగి ఊరికే కూర్చోలేక కార్యకర్తలు వెళ్ళిపోసాగారు.

అప్పుడొచ్చాడు ఇంటి సొంతదారు. పది నెలలనుంచి ఇంటి అద్దె బాకీ! అప్పట్లో ఇల్లు ఖాళీ చేయమనేవాడు. ఇప్పుడు అద్దె మాత్రమే కట్టమంటున్నాడు.

కార్యకర్తలున్నప్పుడు మర్యాదగానే మాట్లాడతాడు. లేనప్పుడు తిట్టినంత పని చేస్తాడు. 'పెద్దమనిషివి నువ్వే చెప్పు' అని రాంని అడ్డంపెట్టి అడిగాడు.

రావు దేనికీ మాట్లాడడు. రాంకి పరిస్థితి పూర్తిగా అర్థమయిపోయింది. ఇంటి రెంటు యాభైవేలు కట్టాలి.

రాం సర్ది చెప్పాడు. 'నేను ఏర్పాటు చేస్తాను. సాయంకాలం రండి.' అదోలా చూసి అతను వెళ్ళిపోయాడు.

పిల్లలది రెసిడెన్షియల్ స్కూలు. స్నానం చేయించి, బట్టలు తొడిగి వాళ్ళను తీసుకుపోయి స్కూలులో ఇద్దరినీ చేర్పించి వచ్చారు వాళ్ళిద్దరు. సాయంకాలం పిల్లలు ఇంటికి రారు. వాళ్ళకు అన్ని వసతులూ అక్కడే ఉంటాయి. ఇద్దరికీ నెలకు పదివేలు! రాం అడ్వాన్సు కట్టి, నెలనెలా సొమ్ము పంపుతానని చెప్పాడు యాజమాన్యంతో.

రావు భార్యను, టాక్సీ పిలిపించి, తీసుకుపోయి, హాస్పటల్‌లో చేర్పించాడు. డబ్బు చెల్లించి రశీదు తీసుకున్నాడు రాం. ఆమె చెల్లెలికి ఫోను చేసి పరిస్థితి చెబితే తాను బయలుదేరి వస్తున్నానంది.

ఇద్దరూ రావు ఇంటికి వచ్చినప్పుడు రాం చెప్పాడు. 'మనం ఇల్లు ఖాళీ చేసి అనంతపురం వెళ్ళిపోదాం'.

రావు నవ్వి ఊరుకున్నాడు.

సాయంకాలం ఇంటి ఓనరుకు రెంటు చెల్లించాడు రాం. అతనయోమయంగా చూసి మారుమాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

'నువ్వెందుకు ఇంత డబ్బు ఖర్చు చేస్తున్నావు?' రావు అడిగాడు.

'మా కోసం ఉద్యమం ప్రారంభించిన నువ్వు బాధపడకూడదని'.

'నీకింత డబ్బు ఎక్కడిది?'

'నేను అడక్కపోయినా పిచ్చి డబ్బు వచ్చి పడుతుంది. దాచిపెడితే 'ఇంత డబ్బు నీకెక్కడిదని' ఎవరైనా ఎప్పుడయినా అడుగుతారు. కోట్లున్న వాళ్ళకు మరోకోటి చేరినా సమస్యలుండవు. ఏమీ లేని దళితుల దగ్గర లక్ష్యలున్నా తల నొప్పులు వస్తాయి.'

'నీకు నేనీ బాకీ చెల్లించలేను.'

'ఇది బాకీ కాదు.'

సాయంకాలం టీ తాగుతూ ఉన్నప్పుడు రావును అనంతపురం రావటానికి సిద్ధం కమ్మన్నాడు రాం.

రానన్నాడు. ఏమి అంటే ఉద్యమం వదిలి రానన్నాడు. అనంతపురం నుంచి ఉద్యమం చేయవచ్చునని రాం సూచించాడు. సాధ్యం కాదన్నాడు. ఈ ఇల్లు ఉద్యమకేంద్రం, ఇక్కడే ఉంటానన్నాడు రావు.

రాం మాట్లాడలేకపోయాడు.

రాత్రి భోజనం చేస్తూ ఉన్నప్పుడు రావును అడిగాడు రాం. 'దేశంలో సమైక్యత లేనట్లుగానే దళితుల్లోనూ లేకపోతే నష్టమేముంది?'

'నష్టమే! దళితులకు చెందవలసిన హక్కులు సాధించుకోవటానికి మనం సమైక్యంగా ఉండటం అనివార్యం.'

'మనం ఎవరి దగ్గర్నుంచి హక్కులు సాధించుకోవాలి?'

'భారతీయుల దగ్గర్నుంచి'.

'మనం భారతీయులమే కదా!'

'భారతీయుల్లో సవర్ణులు నుంచి అవర్ణులు తమ వాటా హక్కులు పొంది, దారిద్ర్యం నుంచి విముక్తి పొందవలసి ఉంది.'

'మాదిగలు మన నుంచి తమ వాటా హక్కుల్ని పొంది విముక్తులు కావాలను కొంటున్నారు కదా!'

'విడిపోతే సమైక్యత దెబ్బ తింటుంది. మన హక్కుల్ని డిమాండ్ చేసే పరిస్థితి అవకాశం కోల్పోతాం.'

'అసమానుల మధ్య సమైక్యత సాధ్యం కాదు కదా, సవర్ణ భారతీయులతో మనం సమానం అయి సమైక్యంగా ఉండాలనే కదా తాపత్రయం'

'నిజమే!'

'దళితుల్లో మాలలతో మాదిగలు సమానులైతేనే కదా సమైక్యత సిద్ధించేది?'

'వాళ్ళు సమానులే కదా!'

'అంటరానితనంలోనే, దాని అవస్థలలోనే వాళ్ళు మనతో సమానులు. విద్యా, ఉద్యోగ, విజ్ఞాన, రాజకీయ, ఆర్థిక రంగాలలో వాళ్ళు మనకంటే వెనుకబడి ఉన్నారన్నది వాస్తవమే కదా!'

'వాస్తవమే, కానీ సమైక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం'.

'ఇంతకాలం సమైక్యంగానే ఉన్నాం. మాదిగలు ఏం సాధించారు?'

'అభివృద్ధి చెందుతూనే ఉన్నారు కదా!'

'మనతో పాటు, మనం చెందినంత అభివృద్ధి వాళ్ళు చెందలేదు కదా!'

'సవర్ణులు చెందుతున్నంత అభివృద్ధి మాలలూ చెందటం లేదు కదా!'

'నిజమే! మాలల అంతటి అభివృద్ధి మాదిగలు చెందటం లేదు!'

'దీనికి పరిష్కారం సమైక్య పోరాటమే. ప్రజాస్వామ్యంలో బలమైన గుంపే తమహక్కులు, అధికారాలు, అవకాశాలు సాధించుకోగలదు. విడిపోతే అంతరించి పోతాం.'

'ఇప్పటికే అంతరించిపోయే దిశలో ఉన్నవాళ్లు, బాగుపడటానికే విడిపోవటం కోరుకుంటున్నారు.'

'విడిపోతే?'

'వాళ్ళ హక్కులు, అధికారాలు, అవకాశాలు వాళ్ళు పొంది, అభివృద్ధి చెందుతారు!'

'చెందితే?'

'దళితులందరూ సమానులౌతారు!'

'అయితే?'

'సవర్ణులతో సమానులు కావటానికి సమైక్యంగా పోరాడతారు.'

'వాళ్ళు సవర్ణులు, మనం అవర్ణులమని, వాళ్ళు అంటదగినవాళ్ళు, మనం అంటరానివాళ్ళం అని ఎంతకాలం బాధపడతాం'.

'బాధపడరాదు. బాధలు పోగొట్టుకోవటానికే కదా ప్రయత్నం. అవర్ణులు, సవర్ణులు భారతీయ వ్యవస్థలో ఎడం ఏర్పరచటానికి ఏర్పడ్డ మాటలు. మాలలు, మాదిగలు వేరుచేసే మాటలే! ఏ కులాలు లేనిదిగా భారతీయ సమాజం ఏర్పడటానికి, ప్రజాస్వామ్యం సాధించే అద్భుత స్వప్నం చేరుకోవటానికి, ఈ తేడాలు గుర్తించాలి. రోగం తేడాల్లోనే ఉంది. రోగానికే మందు వేయాలి. అందుకు రోగం తెలియాలి. మాలమాదిగ అనే రోగాలు నయం కావాలి. వీళ్ళు దళితులుగా మాత్రమే ఒక దశలో ఉండగలగాలి. అన్ని కులాల ఆయా వర్ణాలలో అభివృద్ధి చెందిన దశలో అంతర్భవించిన కులాలు పోవాలి. ఒకనాటికి అయిదు వర్ణాలు అంతరించి సమైక్య భారతీయత అవతరించాలి.

'న్యాయమే!'

'సమైక్య భారతీయత సాధించటానికి ప్రజలు అభివృద్ధి చెందాలి'

'నిజమే!'

'భారతీయుల్లో దళితులు అభివృద్ధి చెందటానికి, ప్రత్యేక రాయితీలు అవసరమన్నది తిరుగులేని సత్యం!'

'నిజమే!'

'మాదిగలు మాలలతో సమానంగా అభివృద్ధి చెందటానికి ప్రత్యేక సదుపాయాలు ఉండి తీరాలి.'

'ఏ ప్రాతిపదికన?'

'దళితుల రిజర్వేషన్లు అంబేద్కరు జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేశాడు. దళితుల్లో మాదిగల హక్కులు జనాభా ప్రాతిపదికన  ఏర్పడటం న్యాయం.'

'ప్రభుత్వం దొంగ లెక్కలు చూపుతుంది!'

'దాన్ని ప్రశ్నించాలి. నిజమైన పరిస్థితి వివరించాలి'

'అంతరించి పోతున్న దళిత కులాలు చాలా ఉన్నాయి.'

'వాళ్ళకూ సంరక్షణ ఏర్పడాలి. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ల ప్రకారం, జనాభా దామాషా ప్రకారం, వర్గీకరణ తప్పనిసరి అవసరం.'

ఇద్దరూ భోజనం ముగించి బిల్లు కోసం టేబిల్ ముందు కూర్చుని ఎదురుచూస్తూ ఉన్నప్పుడు రాం ప్రస్తావించాడు.

'మాల మాదిగలుగా ఉన్న దళితులు అన్నదమ్ములా? దాయాదులా?'

'అన్నదమ్ములే!'

'దాయాదులుగా తన్నుకు చావక, అన్నదమ్ములుగా కలిసి ఉండటం శ్రేయస్కరం. కలిసి ఉండలేనప్పుడు విడిపోవటం ధర్మం. విడిపోయినప్పుడు ఉమ్మడి ఆస్తి పంచుకొన్నట్లే ఉమ్మడి రిజర్వేషన్లు పంచుకోవాలి!'

'అంటే?'

'వర్గీకరణ  అంగీకరించాలి'

'లేకపోతే?'

'రావణకాష్ఠం కాలుతూనే ఉంటుంది'

'మంట ఆర్పాలంటే?'

'నువ్వు సమర్థుడివి. ఉద్యమం కోసం సర్వం త్యాగం చేసే గొప్పవాడివి. మేమంతా ఉద్యోగాలు చేసుకొంటూ బ్రతుకుతున్న సామాన్యులం. నిన్ను మేం కాపాడతాం. నువ్వు దళితులు మునుముందు సమైక్యంగా మారేందుకు ఇప్పుడు విడిపోయి    అభివృద్ధి

చెందేందుకు  ఉద్యమం చేయి,. వర్గీకరణ అంగీకరించు. అందుకు పోరాడు. మేమంతా నీకు అండదండ. వెన్నుదన్ను.'

బిల్లు చెల్లించి రాం పైకి లేచాడు. ఇద్దరూ బయటకు వచ్చారు. రావు ఆలోచనలో పడ్డాడు. దళితులు అభివృద్ధి చెందుతారని, సమైక్యంగా సమర్ధభారతీయులుగా మారతారని కలలు కంటున్న రాం ఆ మైకంలో తృప్తిగా అనంతపురం వెళ్ళే రైలెక్కాడు.

ఏం జరిగిందో తెలియదు. ఏ దురలవాట్లు లేని, అంతా బాగా ఆరోగ్యంగా ఉన్న రావు తానున్న ఇంటిలోనే వారం రోజుల తర్వాత, తెల్లవారేసరికి శవమై కనిపించాడు.

హత్య కాదు, ఆత్మహత్య కాదు. దళితుల సమైక్య ఉద్యమం చచ్చిపోయినట్లు రాం ఏడుస్తూనే  ఉన్నాడు.

❁